'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

# అమెరికాలో భారతీయం

**అమెరికాలో** భారతీయుల జనాభా 50 లక్షలు దాటిపోయింది. అమెరికా జనాభాలో ఇది సుమారు ఒకటిన్నర శాతం. చేసే పని పట్ల క్రమశిక్షణతో కూడిన జీవన విధానం ఈ పెరుగుదలకు కారణమైందని చెప్పవచ్చు. ఈ పరిమాణాత్మకమైన మార్పు గుణాత్మకమైన మార్పుగా పరిణమిస్తుండటం విశేషం. ఉద్యోగ, వ్యాపార రంగాలే కాకుండా అమెరికా ప్రధాన స్రవంతి రాజకీయాల్లోనూ పెరుగుతున్న భారతీయుల ప్రాబల్యమే ఇందుకు నిదర్శనం. ఈ దృష్టితో గమనిస్తే ఇటీవల జరిగిన అమెరికా ఎన్నికలు చరిత్రాత్మకమైనవే కాదు, భారతీయతకు సంబంధించి చాలా రకాలుగా ప్రాముఖ్యం కలవిగా చెప్పుకోవచ్చు. ఈ ఏడాది విడుదలైన 'ఇండియన్ జీనియస్: ది మిటియోరిక్ రైజ్ ఆఫ్ ఇండియన్స్ ఇన్ అమెరికా' వంటి పుస్తకాలు ఈ అభ్యున్నతికి అద్దం పడుతున్నాయి. భారతీయ మూలాలున్న కమలా హ్యారిస్ అత్యున్నత పదవికి పోటీ పడటం, హోరాహోరీగా పోరాడి ఓడిపోవడం ఓ చరిత్ర. మరెందరో భారత సంతతి వ్యక్తుల పేర్లు ఎన్నికలకు ముందు, తర్వాత ప్రముఖంగా ముందుకురావడం విశేషం. మారుతున్న అమెరికా రాజకీయ ముఖచిత్రాన్ని ఇది సూచిస్తున్నది.

రెండోసారి అధ్యక్షునిగా ఎన్నికైన ట్రంప్ కొత్త ప్రభుత్వం కోసం జరుపుతున్న నియామకాల్లో భారతీయులకు సింహభాగం దక్కుతుండటం విశేషం. రిపబ్లికన్ అభ్యర్థిత్వం కోసం పోటీపడిన వివేక్ రామస్వామి కీలక పదవిలో నియమితులయ్యారు. ప్రభుత్వ నిర్వహణా వ్యయం తగ్గింపు కోసం ఏర్పాటు చేస్తున్న కమిషన్‌లో ఆయన పారిశ్రామిక దిగ్గజం ఎలాన్ మస్క్‌తో పాటు బాధ్యతలు పంచుకోబోతున్నారు. ఆంతరంగిక భద్రతా సంస్థ ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా కాశ్ పటేల్ పేరు ట్రంప్ ప్రకటించారు. జయ్ భట్టాచార్య జాతీయ ఆరోగ్య సంస్థల డైరెక్టర్ పదవి దక్కించుకున్నారు. హర్మీత్ ధిల్లోన్ న్యాయశాఖలోని పౌరహక్కుల విభాగం అధిపతి కాబోతున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వాన్స్ సతీమణి భారతీయ సంతతికి చెందిన వ్యక్తి అన్నది తెలిసిందే. అవకాశాలు కలిసి వస్తే ఆమె ప్రథమ మహిళ స్థానాన్నీ ఆక్రమించవచ్చు. ఒకరకంగా చెప్పాలంటే ట్రంప్ ప్రభుత్వంపై భారతీయ ముద్ర ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది.

భారతీయతతో మాత్రమే కాకుండా భారతదేశంతో ట్రంప్‌కు ప్రత్యేక రాజకీయ అనుబంధం ఉన్నది. గత అధ్యక్ష ఎన్నికల సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ అసాధారణమైన రీతిలో ట్రంప్‌తో రాజకీయ ర్యాలీ జరిపారు. కానీ, ట్రంప్ ఓటమితో ఆ ప్రయత్నమంతా నిరర్థకమైపోయింది. వ్యక్తిగత స్థాయిలో సాన్నిహిత్యం మాత్రం పెరిగింది. మొన్న గెలిచిన తర్వాత ట్రంప్ ఆ సంగతి పదే పదే ప్రస్తావించడం గమనార్హం. బుష్ హయాంలో అమెరికా-భారత్ అణు ఒప్పందం కుదరడం వెనుక భారత సంతతి ప్రముఖుల కృషి ఉన్నదని ఇప్పటికీ చెప్పుకొంటారు. ఇప్పుడు అక్కడి భారతీయం పైపైకి ఎగబాకింది. పలుకుబడి మిన్నంటింది. కానీ రెండు దేశాల సంబంధాలు ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న సూచనలు కనిపిస్తున్నాయి. దిగుమతి సుంకాలు, డాలరు మారకం, తదితర అంశాల్లో పొరపొచ్చాలు ఏర్పడుతున్నాయి. ఇలాంటి సమస్యల పరిష్కారంలో భారత సంతతి అమెరికన్లు ఏ మాత్రం సహాయకార్ పాత్ర పోషించినా రెండు దేశాల సంబంధాలకు ఎంతో దోహదం చేసినవారవుతారు.

# ప్రతీకారమే కాంగ్రెస్ రాజకీయం

**కక్ష, కార్పణ్యాలు చొరబడితే పగ, ప్రతీకారాలతో రాజకీయాలు రగిలిపోతాయని నడుస్తున్న చరిత్ర చెప్తున్నది. అధికారమిచ్చిన ప్రజల కోసం కాకుండా పాలనా కాలమంతా కేసులు, జైళ్లు, ప్రతీకారంపైనే దృష్టిసారించిన రాజ్యాలేవీ నాటి నుంచి నేటి వరకూ మనుగడ సాగించిన దాఖలాలు చరిత్రలో లేవు. రాజ్యాలు మారినా, రాజులు పోయినా నాటి రాజకీయాలే నడుస్తుండటం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చలా పరిణమిస్తున్నది. ఇవాళ రాజకీయ పార్టీలు చట్టాలను దుర్వినియోగం చేస్తూ తమ రాజకీయ శత్రువులపై వాటిని ప్రయోగించడం దేశ రాజకీయాల్లో సాధారణ విషయంగా మారడం రాజ్యాంగానికి ప్రమాదకరం.**



**పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి**



తెలంగాణలో ప్రజాపాలన కాస్త ప్రతీకార పాలనగా మారిందన్నది సుస్పష్టం. అధికారమే శాశ్వతమని, సింహాసనం తమ సొంతమని భావిస్తూ కాంగ్రెస్ సర్కారు, ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న ఆవేశపూరిత, ప్రతీకారేచ్ఛ నిర్ణయాలపై తెలంగాణ సమాజం లోతుగా అధ్యయనం చేస్తున్నది. అసాధ్యమనుకున్న స్వరాష్ట్రం కలను సుసాధ్యం చేసిన తెలంగాణ జాతిపిత, ఉద్యమ కెరటం కేసీఆర్‌పై, బీఆర్‌ఎస్ పార్టీపై, నాయకత్వంపై సాగుతున్న కుట్ర కోణం అంతా ఇంతా కాదు. బీఆర్‌ఎస్ అనే మొక్కనే మొలవనివ్వనని బహిరంగంగా తన కసిని, కోపాన్ని వెళ్లగక్కిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతీకారేచ్ఛతో రగిలిపోతూ పాలన కంటే కేసులపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. 14 ఏండ్ల పాటు తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించి, పదేండ్లు ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి సేవలందించిన కేసీఆర్‌ను కేసుల్లో ఇరికించి జైల్లో పెట్టాలన్నది ముఖ్యమంత్రి ఉవాచ అని స్పష్టమవుతున్నది. అంతెందుకు తన పేరు ఉచ్చరించలేదనే కారణంతో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను జైల్లో పెట్టి వికృతానందం పొందిన రేవంత్ ఆటిట్యూడ్‌ను ఇవాళ తెలంగాణ సమాజం నిశితంగా గమనిస్తున్నది.

కేసీఆర్‌పై రేవంత్ ప్రతీకారం వెనుక ఓటుకు నోటు కేసు ఉన్నదనే విషయం స్పష్టంగా తెలుస్తున్నది. కొత్తగా తెచ్చుకున్న రాష్ట్రాన్ని, ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రల్లో భాగంగా చంద్రబాబుతో చేతులు కలిపి అడ్డంగా దొరకడంతో నాటి ప్రభుత్వం చట్టప్రకారం చర్యలు తీసుకున్నది. ఆ కారణంగానే ఇప్పుడు కేసీఆర్‌ను జైల్లో వేయాలని రేవంత్ ఉబలాటపడుతున్నారు. అందులో భాగంగానే కాళేశ్వరం కమిషన్, విద్యుత్ కొనుగోళ్ల నివేదిక తదితర అంశాల ఆధారంగా చర్యలుంటాయని లీకులిస్తున్నారు. కాళేశ్వరంతో తెలంగాణ ఎలా సస్యశ్యామలమైనదో ప్రపంచానికి తెలుసు. కారుచీకట్లో ఉన్న తెలంగాణను కరెంట్ వెలుగులతో దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా మార్చిన ఘనత కూడా కేసీఆర్‌దే. ఈ రాష్ట్ర రైతాంగానికి పొలం నిండా నీళ్లు.. కల్లం నిండా కరెంట్ ఇచ్చిన పాపానికి కేసీఆర్‌ను జైల్లో వేయాలని రేవంత్ ఆరాటపడుతున్నట్టు తాజా క్యాబినెట్ భేటీతో రూఢీ అయింది.

ఇక బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఇంటిపై డ్రోన్లు ఎగురవేసి, ఆయన ప్రైవసీకి భంగం కలిగించి, కుట్రకు పాల్పడిన రేవంత్‌పై నాటి సర్కారు చర్యలు తీసుకుంది. దాన్ని మనసులో పెట్టుకున్న ఆయన ప్రతీకారంతో అధికారంలోకి రాకముందే కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో వేస్తానని, జైలులో డబుల్ బెడ్రూం కట్టిస్తానని పదే పదే చెప్పారు. రేవంత్ మాటలను బట్టి ఆయన గమనం ఎటుపోతున్నదో అవగతమవుతున్నది. అందుకోసమే ఈ- కార్ రేసింగ్, ఇతరత్రా అంశాలను కేటీఆర్ చుట్టూ తిప్పుతున్నారు.

> **ఏడాదిలోనే కేటీఆర్‌పై 10 కేసులను నమోదు చేశారు. ఈ నేపథ్యంలో సంబంధం లేని కేసుల్లో ఇరికించి జైలుకు పంపించాలన్నది రేవంత్ కుట్రగా అందరికీ తెలుస్తున్నది. ఇక ఎలాంటి ఆధారాలు లేని ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావును ఇరికించి, జైలుపాలు చేయాలని రేవంత్ ఉవ్విళ్లూరుతున్నారు. బీఆర్‌ఎస్, కేసీఆర్‌ను రాజకీయంగా ఖతం చేసేందుకు రెండు జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ చేయని ప్రయత్నమే లేదు.**

కేసీఆర్‌ను, బీఆర్‌ఎస్‌ను కూకటివేళ్లతో పెకిలించే వ్యూహంతోనే రేవంత్ పాలన సాగుతున్నది. కేసీఆర్, కేటీఆర్‌ను అరెస్ట్ చేసి కట్టడి చేయడం ఎట్లనో ఇటీవల క్యాబినెట్‌లో భేటీలో మంత్రివర్గ సభ్యులకు సీఎం రేవంత్ హితబోధ చేసిన తీరు, త్వరలో పొలిటికల్ బాంబులు పేలుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పదేపదే పునరుద్ఘాటిస్తున్న వైనం, కోమటిరెడ్డి సహా మిగతా మంత్రులు వంతపాడుతుండటం మనం చూస్తూనే ఉన్నాం. ప్రజల్లోంచి పుట్టిన ఉద్యమ పార్టీని కేసులతో, జైళ్లతో బెదిరించగలరా? జన బాహుళ్యం నుంచి వచ్చే నిరసనలను చవిచూడగలరా? ఏడాదిలోనే నూరు శాతం వ్యతిరేకతను మూటగట్టుకున్న రేవంత్ సర్కారు ప్రతీ వర్గం నుంచి ఆందోళనలను ఎదుర్కొంటున్నది.

ప్రజల కోసం, ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రభుత్వం ప్రజల గురించి ఆలోచించాల్సింది పోయి ఇవాళ ప్రతిపక్ష పార్టీని ఖతం చేయాలన్న దురుద్దేశంతో ముందుకు పోతున్నది. ఈ వైఖరి రేవంత్ సర్కార్‌కు పెనుశాపంలా మారుతుంది. అరచేతిని అడ్డుపెట్టుకొని సూర్యకాంతిని ఎవరూ ఆపలేరనే నగ్నసత్యాన్ని పాలకులు గ్రహించాలి. అలాగే ఉద్యమ దివిటీలను ముట్టుకుంటే మరో ఉప్పెన వస్తుందని తెలుసుకుని మసులుకుంటే మంచిది.

**(వ్యాసకర్త: శాసనమండలి సభ్యులు)**

> **ఉద్యోగాల కోసం నిరుద్యోగులు, ఏక్ పోలీస్ విధానం అమలు చేయాలని పోలీసులు, పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌లు, మంచి బువ్వ కోసం హాస్టళ్ల విద్యార్థులు, రైతుబంధు, రుణమాఫీ కోసం రైతన్నలు, వేతనాల కోసం ఆశావర్కర్లు, ఆటోడ్రైవర్లు, హైడ్రా, మూసీ బాధితులు, లగచర్ల, దిలావర్‌పూర్ రైతాంగం.. ఇలా చెప్పుకొంటూపోతే కాంగ్రెస్ ఏడాది పాలనలో రోడ్డెక్కని వర్గమే లేదు. నిరసన తెలపని బాధితులూ లేరు.**



# కృతజ్ఞతలు కాదు.. నిలదీయాలె!

**విద్యార్థులు, నిరుద్యోగుల పోరాట పునాదుల మీద అధికారాన్ని 'హస్త'గతం చేసుకున్న కాంగ్రెస్ పార్టీని నిలదీయాల్సిన సమయం ఆసన్నమైంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు యూత్ డిక్లరేషన్‌లో ప్రకటించిన హామీలను రేవంత్ సర్కార్ అటకెక్కించింది. నామమాత్రంగా ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇచ్చి కొండంత ప్రచారం చేసుకుంటున్నది. అంతేకాదు, ఏడాది పూర్తయినా కీలకమైన విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం గమనార్హం.**

అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రస్తుత ఎంపీ ప్రియాంకాగాంధీ స్వయంగా యూత్ డిక్లరేషన్‌ను ప్రకటించారు. ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి, రూ.5 లక్షల విద్యాభరోసా కార్డు, అమరుల కుటుంబాలకు నెలకు రూ.25 వేలు పింఛన్, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, యువతులకు ఎలక్ట్రిక్ స్కూటర్ల పంపిణీ వంటి అనేక హామీలు గుప్పించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీని సందర్శించిన రాహుల్ వీటి అమలుపై వాగ్దానం చేశారు. ఈ హామీలను విశ్వసించిన నిరుద్యోగులు ప్రభుత్వ మార్పులో కీలక భూమిక పోషించారు. కానీ, తీరా అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ వ్యవహారశైలిలో 'మార్పు' వచ్చింది. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా.. తమ ప్రభుత్వం ఏడాదిలోనే రికార్డు స్థాయిలో ఉద్యోగాలు భర్తీ చేసిందని నిస్సిగ్గుగా అబద్ధపు ప్రచారం చేసుకోవడం విడ్డూరం.

ప్రశ్నించే గొంతుకలం, మేధావి వర్గం అంటూ నాడు బీఆర్‌ఎస్ సర్కార్‌పై విషం చిమ్మినవారు నేడు నిరుద్యోగులకు అన్యాయం జరుగుతున్నా కనీసం స్పందించడం లేదు. పదవులు రాగానే వారి పెదవులు మూతబడ్డాయి. ఈ నేపథ్యంలో ఏరుదాటిన తర్వాత తెప్ప తగలేసిన చందంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరుద్యోగులు కృతజ్ఞతలు తెలపడం కాదు, పాలకులను నిలదీయాల్సిన అవసరం ఉంది.

***- నరేష్ పాపట్ల, 95054 75431***

# సమగ్ర సిబ్బందికి 'శిక్ష'

**అందరికీ నాణ్యమైన ప్రాథమిక విద్యను అందించడమే సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్‌ఎస్‌ఏ) పథకం ప్రధాన ఉద్దేశం. ఈ పథకం ద్వారా కేజీబీవీ పాఠశాలల్లో 20 వేల మంది.. జిల్లా, మండల (ఎంఆర్‌సీ) కార్యాలయాల్లో 18 వేల మంది ఒప్పంద పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న వీరికి శ్రమకు తగిన ప్రతిఫలం మాత్రం దక్కడం లేదు.**

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని గతంలో సుప్రీంకోర్టు చెప్పింది. కానీ, సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బందికి మాత్రం సర్వోన్నత న్యాయస్థానం తీర్పు వర్తించడం లేదు. ఇదిలా ఉంటే, గతేడాది సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మెలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి చాలీచాలని వేతనాలతో జీవితాలను నెట్టుకొస్తున్నవారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అందరినీ పర్మినెంట్ చేస్తామని వాగ్దానం చేశారు. కానీ, నేటికీ ఆ హామీ నెరవేరలేదు.

తమ డిమాండ్ల సాధన కోసం తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 8 రోజులుగా సిబ్బంది నిరవధిక సమ్మె చేస్తున్నారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తమ డిమాండ్లను నెరవేర్చే వరకు టెంట్లు వదిలే ప్రసక్తే లేదని వారు ఘంటాపథంగా చెప్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా సర్కార్ స్పందించాలి. ఒప్పంద, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి, వేతనాలు పెంచాలి. మరణించిన సిబ్బంది కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి. మహిళా ఉద్యోగులకు అన్నిరకాల సెలవులు ఇవ్వాలి. అంతేకాదు, ఆరోగ్య, జీవిత బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర అన్ని వసతులు కల్పించాలి.

***- లకావత్ చిరంజీవి***

# పేద విద్యార్థులపై చిన్నచూపా?

**రాష్ట్రంలోని వసతి గృహాల సమస్యలు రాస్తే రామాయణం, చెప్తే మహాభారతం అవుతాయి. అద్దె భవనాలు, వసతుల లేమి, ఫుడ్ పాయిజన్లతో సహవాసం చేస్తున్న విద్యార్థుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. వారి పరిస్థితిని తలచుకుంటేనే కండ్లల్లో నీళ్లు కదలాడుతున్నాయి. శిథిలావస్థకు చేరుకున్న అద్దె భవనాల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని విద్యార్థులు బతుకీడుస్తుండటం బాధాకరం. కనీస వసతులు లేక దయనీయ పరిస్థితుల్లో ఉంటున్న వారిని పట్టించుకునే నాథుడే కరవయ్యాడు.**

రాష్ట్రంలోని వసతి గృహాలు, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు నిత్యకృత్యమయ్యాయి. కలుషితాహారం కారణంగా అనేకమంది మరణించగా, వందల మంది విద్యార్థులు దవాఖానల పాలయ్యారు. అయినా ప్రభుత్వ తీరు మారడం లేదు. డిసెంబర్ 14న ముఖ్యమంత్రి రేవంత్, మంత్రులు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాలను సందర్శించి కామన్ డైట్ మెనూ పేరిట హడావుడి చేశారు. విద్యార్థులతో కలిసి భోజనాలు చేసి ఫొటోలకు పోజులిచ్చారు. సోషల్ మీడియాలో హంగామా చేశారు. కానీ, వారు హాస్టళ్లను విడిచిన వెంటనే ఆ మెనూను పక్కనపెట్టి పాత పద్ధతిని పాటిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. నిరుపేదలైన విద్యార్థులు ప్రశ్నించలేరనే కారణంగానే పాలకులు వారిని చిన్నచూపు చూస్తున్నారని అనిపిస్తున్నది. విద్యార్థుల మరణాలకు కారణమైన పాత మెనూను మళ్లీ తెరపైకి తీసుకొచ్చి వారి ప్రాణాలతో చెలగాటమాడటం శోచనీయం. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సర్కార్ స్పందించాలి. కామన్ డైట్ మెనూ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి. లేకపోతే విద్యార్థి ఉద్యమాలు పురుడుపోసుకోవడం ఖాయం.

***- హరీష్ సాగర్, 63027 58830***

# కాంగ్రెస్ ఏడాది పాలన ఎటమటమే!

**డిసెంబర్ 7తో ఏడాది పూర్తి చేసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై మీడియా స్పందన ఇప్పుడు చర్చనీయాంశమే. కాంగ్రెస్ పాలన, నిర్ణయాలపై విశ్లేషకులు తమ అభిప్రాయాలను ఎప్పటికప్పుడు వ్యక్తం చేస్తున్నా... ఏడాది అనేది ఒక మైలురాయి. అందుకే, తెలంగాణలో గత పాలనకు, ప్రస్తుత పాలనకు ఉన్న వ్యత్యాసాలపై చర్చించుకొనే సమయం ఇది. ఏ కొత్త ప్రభుత్వానికైనా తొలి ఏడాది కీలకమైనది. ఎన్నికల్లో గెలిపించిన ప్రభుత్వం తీసుకొనే ప్రతి నిర్ణయంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. కొత్త ఉత్సాహంలో ఉన్న ప్రభుత్వాలు కూడా ప్రజల్లో ఉన్న అనుకూల ముద్రను కాపాడుకునేందుకు తాపత్రయపడతాయి.**



**నర్సన్ బద్రి**
**9440128169**

డిసెంబర్ తొలి రెండు వారాల్లో చాలా పత్రికలు రేవంత్ ఏడాది పాలనపై ప్రత్యేక కథనాలు ప్రచురించాయి. తాము 21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, 55 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 42 లక్షల గృహిణులకు రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నది. అయితే, ఇవి అర్ధ సత్యాలే.

రైతు రుణమాఫీ, ఉద్యోగాల భర్తీ, రైతుభరోసా లాంటివి సంపూర్ణంగా అమలు కాలేదు. వీటిలో కొన్ని సగం కూడా పూర్తికాకపోగా మరికొన్ని మొదలే కాలేదు. స్త్రీలకు నెలకు రూ.2,500, వృద్ధాప్య పింఛను రూ.4,000 హామీ ఊసే లేదు. నెలవారీగా ఇచ్చే ఆర్థికసాయం వెంటనే ఇస్తే ఆ హామీకి పరమార్థం ఉంటుంది. రేవంత్‌కు పాలనతో పాటు కాంగ్రెస్ అధిష్ఠానాన్ని ప్రసన్నంగా ఉంచడమూ కీలకం. 'గాంధీ'ల మనసు మారిందంటే పదవికి మంగళమే. అందుకోసం చిన్న విషయానికీ ఢిల్లీ వెళ్లడం, తెలంగాణలో ఆ తల్లీ కొడుకులకు మర్యాద తగ్గకుండా చూసుకోవడం ఆయనకు అతి ముఖ్యమైనదని ఒక పత్రిక పేర్కొన్నది.

'పాలనను అంచనా వేయడానికి ఒక ఏడాది కాలం తక్కువే అయినా కాంగ్రెస్ హామీల దృష్ట్యా ఇది కీలకమే' అని ది హిందూ అభిప్రాయపడింది. మాజీ సీఎం కేసీఆర్‌పై పలు ఆరోపణలు చేస్తూ ఎన్నికల్లో నెగ్గిన రేవంత్‌రెడ్డి తానేంటో నిరూపించుకొనే సమయమిదేనని.. ఆర్థిక హామీలు నెరవేర్చడంలో విఫలమవుతూ, గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిందనే నెపంతో కాలహరణ చేయడం తగదని ఈ పత్రిక పేర్కొన్నది. హామీల పట్ల నిబద్ధత, పాలనాపరమైన విధివిధానాల్లో పారదర్శకత లోపించిందని, రాబోయే నాలుగేండ్లు మరింత కఠినంగా గడుస్తాయని కూడా ఇందులో పేర్కొన్నది.

'రేవంత్ రెడ్డి ఏడాది పాలనలో ఎన్నికల హామీల విషయంలో ప్రధాన ప్రతిపక్షం నుంచి నిరంతర విమర్శలను ఎదుర్కోక తప్పలేదు' అని హిందుస్థాన్ టైమ్స్ రాసింది. అయితే, 'బయటినుంచి కాకుండా కాంగ్రెస్ సీనియర్ నేతలతోనే ఆయనకు ప్రమాదం పొంచి ఉన్నది. గతంలో మంత్రులుగా పనిచేసిన వారిని పక్కనబెట్టి ఎన్నడూ మంత్రి పదవి చేపట్టని రేవంత్‌ను ఏకంగా సీఎం కుర్చీపై కూర్చోబెట్టడం అరుదైన సందర్భమే. ఆ కొనసాగింపుపై అధిష్ఠాన దీవెనలు ఆయనకు ముఖ్యం. ఆ వైపు కూడా రేవంత్ ఏ మాత్రం తగ్గని విధేయత ప్రదర్శిస్తున్నారు. తోటి మంత్రులతోనే కాకుండా అధికారులతో కూడా రేవంత్‌కు తగిన సహకారం అవసరం. గత పదేండ్లు కేసీఆర్ నమూనా పాలనలో కొనసాగిన అధికారులు రేవంత్ పట్టాలపై ఎక్కేందుకు సమయం పడుతుంది. ప్రత్యేకంగా ఆర్థిక, ప్రణాళిక శాఖల్లో పని చేస్తున్న అధికారులకు రేవంత్ హామీల సాధ్యాసాధ్యాలపై అవగాహన ఉంటుంది. హామీల ప్రాధాన్యతాక్రమంపై వారి సలహాలు అవసరం' అని ఈ పత్రిక పేర్కొన్నది.




'ఏడాది పాలనలో రేవంత్‌రెడ్డి తీసుకున్న ప్రతి నిర్ణయం, హామీ అమలు ఏదైనా నిజాయితీగా, విమర్శలు లేకుండా సాగడం లేదు. అసంపూర్ణ రైతు రుణమాఫీ, రైతు భరోసా వాయిదాలు ప్రభుత్వంపై ప్రజల నమ్మకం సన్నగిల్లేలా చేస్తున్నాయి' అని ఒక ప్రముఖ తెలుగు ఛానల్ పేర్కొన్నది. 'పార్టీ పరంగా రేవంత్‌రెడ్డి జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ ప్రభుత్వపరంగా ప్రజల్లో అసంతృప్తి తలెత్తకుండా చూడటంలో మాత్రం విఫలమయ్యారు. పాత ప్రభుత్వం అమలుచేసిన పథకాల ను కొనసాగిస్తూ కొత్త పథకాల అమలు చేస్తే ప్రజ లు హర్షిస్తారు గాని, అమల్లో ఉన్న పథకాలను నిలిపివేసి కొత్తగా ఎన్ని పథకాలు అమలుచేసినా ప్రజ లు సంతృప్తి చెందరు' అని ఒక పత్రిక పేర్కొన్నది. 'ఉన్న నిధులన్నింటినీ రైతు రుణమాఫీకి మళ్లించడం వల్ల మరిన్ని పథకాలకు నిధుల కొరత ఏర్పడింది. ఫలితంగా ఎన్నో హామీలు నిలిచిపోయా యి. దీనిపై ప్రజల్లో, ముఖ్యంగా రైతుల్లో అసంతృప్తి నెలకొన్నది' అని మరో పత్రిక విశ్లేషించింది.

'హైడ్రా ఏర్పాటు రేవంత్ పాలనలో ఓ తొందరపాటు చర్య. చెరువులు, కుంటల పరిరక్షణ అవసరమే. కానీ, ఆ సాకుతో పేదల ఇండ్ల కూల్చివేత మొదలైన నాటి నుంచి ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. చేతనైతే అన్ని పార్టీల నేతల, ప్రముఖుల ఫాంహౌజ్‌లను ముందు నేలమట్టం చేయాలి. మూసీ ప్రక్షాళన, హైడ్రా వంటి ఆపరేషన్లను ఒకే పర్యాయం అమలు చేయాలనుకోవడమే ప్రభుత్వం చేసిన తప్పు. లక్ష్యం ఎంత మంచిదైనా దాన్ని చేరుకోవడానికి ఎంచుకొనే మార్గం కూడా పారదర్శకంగా ఉండాలి' అని ఒక పత్రిక సీఎం తప్పొప్పులను అంచనా వేసింది.

> **'సీఎంగా రేవంత్‌రెడ్డి ముందుగా తన భాషను మార్చుకోవాలి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వాడిన భాషనే ఇప్పుడు కూడా వాడితే ప్రజలు హర్షించరు. తనను తాను సవరించుకుంటే బాగుంటుంది' అని ఒక పత్రిక సూచించింది.**

'సున్నా మార్కులు వచ్చిన విద్యార్థికి సబ్జెక్టు తెలియనట్టే తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని రేవంత్‌రెడ్డికి రాష్ట్ర అవసరాలు తెలియవు. వచ్చిన అవకాశాన్ని వినియోగించకుండా తెలంగాణ అధికారిక చిహ్నాల మార్పునకు తలపడడం మంచిది కాదు. తెలంగాణ తల్లి మార్పును ఒక ఔట్‌సైడర్ దాడిగా భావించక తప్పదు' అని ఓ ఛానల్లో చర్చ జరిగింది. రేవంత్ రెడ్డి ఏడాది పాలనలో హామీల అమలులో సందిగ్ధత, హైడ్రా లాంటి తొందరపాట్లు, సాటి నేతల పట్ల దురుసు భాష అనే అంశాలు అన్ని వేదికలపై ప్రస్తావించబడ్డాయి. ఈ విషయాలపై ప్రభుత్వం సమీక్షించుకొని, సవరించుకుంటే ఓట్లేసిన ప్రజలు హర్షిస్తారు.






# మేమూ పన్నులు విధిస్తాం!

> **ఇండియా, బ్రెజిల్ లాంటి దేశాలు అమెరికా ఎగుమతులపై భారీగా పన్నులు విధిస్తున్నాయి. ఒకవేళ వారు మా వస్తువులపై 100 శాతం ట్యాక్స్‌లు విధించాలనుకుంటే మంచిదే. మేము కూడా వారి వస్తువులపై అదేస్థాయిలో పన్నులు విధిస్తాం. మా పట్ల మీరు ఎలా ప్రవర్తిస్తున్నారో, మీరు కూడా మా నుంచి అదే ఆశించాలి.**

- డొనాల్డ్ ట్రంప్